

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసిపి ఓర్వలేని తనంతో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధిపై విష ప్రచారాన్ని చేస్తుంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 15.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 84 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఫైళ్లకే కాదు... అభివృద్ధికీ క్లియరెన్స్!

- బిజినెస్ రూల్స్‌లో భారీ సంస్కరణలకు శ్రీకారం
- క్రౌడ్ సోర్సింగ్‌తో ఫిర్యాదుల పర్యవేక్షణ
- ప్రజా సేవల్లో వేగం, జవాబుదారీతనంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్ధిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం :** క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్ధిక, ఆర్ధికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా

మిగతా 2లో...

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

నెలవారీ ఆర్ధిక నివేదికలతో ఆశించిన పురోగతి

అర్జీల పరిష్కారం, క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో

## పోలవరానికి పర్యాటక శోభ

ప్రాజెక్టుతో పాటు గోదావరి తీరంలో టూరిజం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

అఖండ గోదావరి ప్రాజెక్టు కింద నదీతీరం అభివృద్ధి

అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో

## భారత్ టెక్స్‌లో 'లేపాక్షి' కళావైభవం!

- ఢిల్లీలో ఏపీ స్టాల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్
- కలంకారీ, లేస్, కార్పెట్లకు అంతర్జాతీయ సందర్శకుల ప్రశంసలు
- గ్లోబల్ మార్కెట్‌పై లేపాక్షి గురి



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర వస్త్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రత్యేక ఆహ్వానం మేరకు కేంద్ర జౌళిశాఖ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ న్యూఢిల్లీలో జరుగుతున్న 'భారత్ టెక్స్-2026' ప్రదర్శనను సందర్శించి, ఆంధ్రప్రదేశ్ 'లేపాక్షి' స్టాల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ లేపాక్షి స్టాల్‌లోని ప్రతి విభాగాన్ని ఆసక్తిగా తిలకించారు. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దిన హస్తకళా ఖండాలు, చేనేత వస్త్రాల వెనుక ఉన్న కళాకారుల అపూర్వ నైపుణ్యాన్ని, వారి శ్రమను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి ప్రదర్శనలు భారతీయ సాంప్రదాయ కళలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద వస్త్ర ప్రదర్శనలలో ఒకటిగా, టెక్స్‌టైల్, అపారెల్ పరిశ్రమకు ప్రీమియర్ గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా నిలిచిన ఈ 'భారత్ టెక్స్-2026'లో 140కి పైగా దేశాల భాగస్వామ్యంతో,

మిగతా 2లో...

## పోర్టుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్!

- మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల రెండో దశకు పరిపాలనా ఆమోదం
- 6,248 ఎకరాల భూసేకరణకు రూ.1,638 కోట్ల మంజూరు
- తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్‌కూ ఊతం

2 లో

## నెలనెలా లెక్క... సుపరిపాలనకు బాట!

- దేశంలోనే తొలిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల విధానం
- ప్రజా సమస్యలపై రియల్ టైమ్ స్పందన
- స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకు సమగ్ర కార్యాచరణ

మిగతా 3లో...

### పిల్లల కంటి వెలుగుకు

## మంత్రి సత్యకుమార్ సంకల్పం

- 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు
- 95 వేల నుంచి భారీగా పెరిగిన పంపిణీ లక్ష్యం
- 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు
- నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్న 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారిలో 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని వెల్లడించారు. జూలై 15 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల విద్యార్థులందరినీ పరీక్షించనున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా

మిగతా 2లో...

# బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపు... ఎవరి కోసం?

- పదవీ విరమణ వయస్సు పెంపుపై వైద్య విద్యా శాఖలో కలకలం
- వయస్సు పెంపు కాదు... వ్యవస్థను బలోపేతం చేయండి - ప్రభుత్వ వైద్యులు
- 200 ప్రొఫెసర్ పోస్టుల కోసం వేలాది మంది వైద్య అధ్యాపకుల పదోన్నతులకు బ్రేక్?
- జూనియర్ డాక్టర్లు, అసిస్టెంట్-అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత
- గతంలో రెండు సార్లు తిరస్కరించిన ప్రతిపాదన మళ్లీ తెరపైకి... ఆర్థిక శాఖలోనూ అభ్యంతరాలే
- పదవీ విరమణ వయస్సు పెంపు కంటే వన్‌టైమ్ పదోన్నతులే పరిష్కారమంటున్న వైద్యులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య విద్యా శాఖలో ప్రభుత్వ బోధనా వైద్యుల పదవీ విరమణ వయస్సును ప్రస్తుతం అమల్లో ఉన్న 63 సంవత్సరాల నుంచి మరింత పెంచే ప్రతిపాదన మరోసారి తెరపైకి రావడంతో వైద్య వర్గాల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఇప్పటికే గతంలో రెండు సార్లు ఆర్థిక శాఖ తిరస్కరించిన ఈ ప్రతిపాదనను మళ్లీ మూడోసారి తెరపైకి తీసుకురావడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, జూనియర్ వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొందరు సీనియర్ అధికారులు స్వలాభం కోసం మాత్రమే ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకువస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వ వైద్యుల సంఘం, ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ వేర్వేరుగా స్పందిస్తూ ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాయి.

**జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అభ్యంతరం :** జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శి బలగం దినకర్ సాయి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో, కేవలం సుమారు 200 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనే కారణంతో పదవీ విరమణ వయస్సు పెంచడం శాశ్వత పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల కొత్త నియామకాలు మరింత ఆలస్యమవడంతో పాటు, పీజీ పూర్తి చేసిన వేలాది మంది యువ వైద్యులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో నియామకాలు ఆలస్యం కావడం వల్ల యువ వైద్యుల వృత్తి పురోగతిపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఖాళీలకు అసలు కారణం అర్హులైన వైద్యులు లేకపోవడం కాదని, ఆమోదిత పోస్టులను భర్తీ చేయడంలో జాప్యం, క్రమబద్ధమైన పదోన్నతులు లేకపోవడం, అవసరమైన మేరకు కొత్త పోస్టులు సృష్టించకపోవడమే ప్రధాన కారణాలని వివరించారు. వెంటనే అన్ని ఆమోదిత పోస్టులను భర్తీ చేయాలని, స్పెషలిస్టులు, అధ్యాపకులు, వైద్యాధికారుల నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనుభవజ్ఞులైన సీనియర్ వైద్యుల సేవలు అవసరమైతే కాంట్రాక్టు, కన్సల్టెన్సీ, మెంటార్‌షిప్ విధానాల ద్వారా కొనసాగించవచ్చని సూచించారు.

**ప్రభుత్వ వైద్యుల సంఘం అత్యవసర భేటీ :** ఇదిలా ఉండగా, మూడోసారి ఈ ప్రతిపాదన తెరపైకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లలో ఆందోళన వ్యక్తమైంది. దీంతో వారి ఒత్తిడి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ



• వివరాలు 2 లో

# బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపు... ఎవరి కోసం?

(మొదటి పేజీ తరువాయి)

వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జయధీర్ నేతృత్వంలో అత్యవసర అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. పదవీ విరమణ వయస్సు పెంపుపై ప్రభుత్వ వైద్యుల సంఘం అత్యవసరంగా సభ్యుల అభిప్రాయాలను సేకరించింది. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు అధిక సంఖ్యలో ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. గతంలో ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారి సగటు వయస్సు 50--53 ఏళ్లు కాగా, ప్రస్తుతం ఇది 40--45 ఏళ్లకు తగ్గిందని, ఈ పరిస్థితుల్లో పదవీ విరమణ వయస్సు పెరిగితే ఒకసారి ప్రొఫెసర్ అయిన వ్యక్తి మరో 18 నుంచి 20 సంవత్సరాలు అదే హోదాలో కొనసాగుతారని, ఫలితంగా దిగువ స్థాయి అధ్యాపకులకు పదోన్నతి అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. గతంలోనూ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీల పేరుతో కాంట్రాక్టు నియామకాలకు ప్రయత్నించిన సమయంలో వన్ టైమ్ పదోన్నతుల కోసం సంఘం పట్టుబట్టడంతో, ప్రభుత్వం వన్‌టైమ్ పదోన్నతులు చేపట్టడంతో ఖాళీలు ఉన్న పోస్టుల కంటే ఎక్కువ మంది పోటీ పడిన విషయాన్ని సభ్యులు గుర్తు చేశారు ఇప్పుడూ అదే విధానాన్ని అనుసరిస్తే ఎక్కువ భాగం ఖాళీలు భర్తీ అవుతాయని, మిగిలిన కొద్దిపాటి పోస్టులను అవసరమైతే తాత్కాలిక పద్ధతిలో కాంట్రాక్టు ద్వారా భర్తీ చేయవచ్చని సూచించారు.

**ప్రభుత్వ ఉద్యోగాలను వీడి ప్రైవేట్ రంగంలోకి వెళ్లే ప్రమాదం :** పదోన్నతి అవకాశాలు లేకపోతే ఇప్పటికే ప్రభుత్వ సేవలో కొనసాగుతున్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లలో నిరుత్సాహం పెరిగి, కొందరు ప్రభుత్వ ఉద్యోగాలను వీడి ప్రైవేట్ రంగంలోకి వెళ్లే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు.

**పదవీ విరమణ వయస్సు పెంపుతో ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ ఎలా ? :** సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడానికి కూడా ప్రత్యేక కారణాలు ఉన్నాయని పలువురు వైద్యులు పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ వేతనాలు తక్కువగా ఉండటంతో సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రభుత్వ సేవల్లో చేరలేదని, అనంతరం వేతన సవరణల తర్వాతే కొద్దికొద్దిగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చేరడం ప్రారంభించారని గుర్తు చేశారు. వీరు నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందడానికి నిర్దిష్ట అనుభవ కాలం అవసరమవుతుందని, పోస్టింగ్ మార్పుల కారణంగా చాలా మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు పదోన్నతులు తీసుకోవడం లేదని వివరించారు. కాబట్టి కేవలం పదవీ విరమణ వయస్సు పెంచడం ద్వారా ఖాళీ ప్రొఫెసర్ పోస్టులు స్వయంగా భర్తీ కావని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ పోస్టులు భర్తీ కావాలంటే తప్పనిసరిగా పదోన్నతులే మార్గమని, ఈ ప్రాథమిక అంశాన్ని పక్కనబెట్టి పదవీ విరమణ వయస్సుపైనే దృష్టి పెట్టడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

**పీజీ శిక్షణ పూర్తి చేసుకున్నవారి భవిష్యత్తుపై ఆందోళన :** ఈ పరిస్థితుల్లో పదోన్నతులు నిలిచిపోతే కొత్తగా ప్రభుత్వ సేవల్లో చేరే వైద్యులకు పోస్టులు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. రానున్న సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సర్వీసు పీజీ పూర్తి చేసుకున్న సుమారు 430 మంది వైద్యులు అందుబాటులోకి రానున్నారు. ప్రతి సంవత్సరం సగటున 300 మంది ఇదే కేటగిరీలో చేరుతుంటారు. వీరికి



పోస్టింగులు ఇచ్చేందుకు తగినన్ని ఖాళీలు చూపించాల్సి ఉండగా, పదవీ విరమణ వయస్సు పెంపు ద్వారా ఆ అవకాశాలు మరింత కుంచించుకుపోతాయని, ఇక డైరెక్ట్ రిక్రూట్‌మెంట్లకు అవకాశాలు దాదాపు లేకుండాపోతాయని, దీంతో వైద్య విద్యా శాఖలో నియామకాల ప్రక్రియ అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**పీజీ సీట్ల కేటాయింపుకు మౌలిక సదుపాయాలు అవసరం :** పీజీ సీట్ల కేటాయింపులో కేవలం ప్రొఫెసర్ల సంఖ్యే కాకుండా మౌలిక సదుపాయాలు, ఆసుపత్రి సామర్థ్యం, రోగుల సంఖ్య వంటి అనేక అంశాలను ఎన్‌ఎంసీ పరిగణనలోకి తీసుకుంటుందని, ఆ అంశాలపై దృష్టి పెట్టకుండా పదవీ విరమణ వయస్సు పెంపునే ప్రధాన పరిష్కారంగా చూపడం సరికాదని పేర్కొంటున్నారు.

**ప్రభుత్వంతో నిర్మాణాత్మకమైన చర్చలు చేద్దాం :** సభ్యుల అభిప్రాయాలు విన్న అనంతరం ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేపట్టిన సంస్కరణలతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పరిస్థితులు మెరుగుపడ్డాయని మంత్రి అమలు చేస్తున్న 30 పాయింట్ల ఫార్ములా ద్వారా బోధనాస్పత్రులకు ప్రజాదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. వైద్య విద్యా శాఖలో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా 'జీరో వేకెన్సీ' లక్ష్యాన్ని అమలు చేయడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. సభ్యుల ఆందోళనలనురాష్ట్ర కార్యవర్గంతో కలిసి నేరుగా మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు, అలాగే ఈ అంశంపై లోతైన అధ్యయనం కోసం సంఘంలోని పన్నెండు మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేసి, ముఖ్యమంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి, ఆర్థిక శాఖ, సాధారణ పరిపాలన శాఖలకు సమర్పించాలని నిర్ణయించారు. అంతేకాక, వైద్య శాఖ, ఆర్థిక శాఖ, న్యాయ శాఖ, జీఏడీ, ప్రభుత్వ వైద్యుల సంఘం, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌లతో కూడిన ఆరు నెలల కాలపరిమితి గల ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే పదవీ విరమణ వయస్సుపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాలని సమావేశంలో నిర్ణయించారు.

**ఆర్థిక శాఖ విముఖం...మోయలేని భారం...వివాదాలమయం :** ప్రభుత్వ బోధన వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదనపై నెలకొన్న వివాదం నేపథ్యంలో, గతంలో ఆర్థిక శాఖ ఈ అంశాన్ని ఎలా పరిశీలించిందనే విషయాన్ని తెలుసుకునేందుకు 'జర్నలిస్ట్ ఫైల్' ప్రతినిధి ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారిని సంప్రదించారు. అధికారికంగా స్పందించడానికి, తన పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఆ అధికారి ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ... కేవలం కొందరు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్థాయి అధికారుల వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ ప్రతిపాదన మళ్లీ మళ్లీ తెరపైకి వస్తోందని డీఎంఈ కార్యాలయంలో కీలక అధికారులు మారినప్పుడల్లా ఇదే ప్రతిపాదన పునరావృతం కావడం ఆశ్చర్యం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. గతంలోనూ ఇదే ప్రతిపాదనను పలు కారణాలతో తిరస్కరించినట్లు పేర్కొన్నారు. వంద లేదా రెండు వందల ఖాళీల కోసం వేలాది మంది ఉద్యోగుల పదోన్నతులు నిలిచిపోయే పరిస్థితి తలెత్తడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ పోస్టులు పదోన్నతుల ద్వారానే భర్తీ కావాల్సి ఉన్నప్పుడు పదవీ విరమణ వయస్సు పెంపు ద్వారా సమస్య పరిష్కారం కాదని, ముందుగా వన్‌టైమ్ పదోన్నతులు ఇచ్చి వాస్తవ ఖాళీలను నిర్ధారించాలని వ్యాఖ్యానించారు. ఆ అధికారి ఇంకా మాట్లాడుతూ, "గణాంకాలు పరిశీలిస్తే సమస్య ఎక్కడుందో స్పష్టంగా అర్థమవుతుంది. పదవీ విరమణ వయస్సు పెంపు అవసరమా కాదా అన్నది స్పష్టంగా అర్థమవుతుంది. 2024లో మొత్తం 49 మంది ప్రొఫెసర్లు, 2025లో 53 మంది ప్రొఫెసర్లు పదవీ విరమణ చేశారు. 2026 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు పదవీ విరమణ చేయనున్న ప్రొఫెసర్ల సంఖ్య కూడా కేవలం 58 మాత్రమే. అంటే వరుసగా మూడు సంవత్సరాల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ సంఖ్య 49, 53, 58గా మాత్రమే ఉంది. కొంచెం అటు,ఇటుగా ఇదే సంఖ్యలోనే ప్రతి ఏడాది ప్రొఫెసర్ పదోన్నతులు కూడా జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే, ఆ పోస్టులకు అవసరమైన అర్హతలు కలిగిన వారు లేరన్నమాట. ఒకవేళ అర్హులు ఉన్నట్లయితే ముందుగా 1:3 నిష్పత్తిలో వన్‌టైమ్ పదోన్నతులు చేపట్టాలి. ఆ తర్వాత కూడా ఎన్ని పోస్టులు ఖాళీగా మిగులుతాయో స్పష్టంగా వెల్లడించాలి. ఆ ఖాళీలకు అవసరమైతే కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. దీంతో ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం తగ్గడంతో పాటు వివిధ ఉద్యోగ వర్గాల నుంచి వచ్చే ఒత్తిడులు, పరిపాలనా సమస్యలు కూడా తగ్గుతాయి. అయినప్పటికీ ఈ ప్రత్యామ్నాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రతి సారి పదవీ విరమణ వయస్సు పెంపునే పరిష్కారంగా ప్రతిపాదించడం వెనుక ఉద్దేశం ఏమిటో సంబంధిత అధికారులే చెప్పాలి. పీజీ సీట్ల పెంపు అవసరమైతే అది ప్రొఫెసర్ కేడరు వరకు మాత్రమే సంబంధించిన అవసరాల మేరకే ప్రతిపాదించాలి. అయితే ప్రొఫెసర్లతో పాటు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కేడర్‌కు కూడా తప్పనిసరిగా పదవీ విరమణ వయస్సు పెంచాలని ప్రతిపాదించడం వెనుక ప్రత్యేక ఉద్దేశం ఉన్నట్లుగా కనిపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి అని పేర్కొన్నారు.

"మరో ఏడాదిలోనే కేంద్రంలో 8వ కేంద్ర వేతన సంఘం సిఫారసులు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. అలాంటి సమయంలో కేవలం 100--200 ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలను కారణంగా చూపిస్తూ పదవీ విరమణ వయస్సు పెంచాలని ప్రతిపాదించడం సమంజసం కాదు. ప్రస్తుతం వైద్య విద్యా శాఖలో పాత పెన్షన్ విధానం కింద ఎంత మంది బోధన వైద్యులు సేవలందిస్తున్నారో, వారిలో పదవీ విరమణ అనంతరం 8వ కేంద్ర వేతన సంఘం ప్రకారం ప్రభుత్వంపై పడే పెన్షన్ భారం ఎంత ఉంటుందో సంబంధిత అధికారులు సమగ్రంగా అంచనా వేశారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది సీనియర్ వైద్యులకు నెలవారీ పెన్షన్, వారు ఉద్యోగంలో ఉండగా పొందిన చివరి జీతానికి సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. భారతదేశంలో సగటు ఆయుర్దాయం సుమారు 85 సంవత్సరాలకు చేరుతున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక పెన్షన్ బాధ్యత ప్రభుత్వంపై మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అదే సమయంలో సీపీఎస్ పరిధిలోని ఉద్యోగుల కోసం ప్రభుత్వం చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్ కూడా అదనపు ఆర్థిక భారంగా మారుతుంది. మరోవైపు, రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల్లోనూ అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఒక వర్గానికి మాత్రమే పదవీ విరమణ వయస్సు పెంపు వర్తింపజేస్తే, ఇతర ఉద్యోగ సంఘాల నుంచి కూడా ఇదే తరహా డిమాండ్లు వెల్లువెత్తే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వంపై ఆర్థిక, పరిపాలనా ఒత్తిళ్లు మరింత పెరుగుతాయని ఆర్థిక శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేవలం కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాల వల్ల ప్రభుత్వం అన్ని ఉద్యోగ వర్గాల్లో విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు.

**ప్రభుత్వం స్పందించే తీరుపైనే...వైద్య విద్యా శాఖ భవిష్యత్తు :** ఒకవైపు ప్రొఫెసర్ల కొరతను కారణంగా చూపుతూ పదవీ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదన ముందుకు వస్తుండగా, మరోవైపు అదే సమస్యకు వన్‌టైమ్ పదోన్నతులు, క్రమబద్ధమైన నియామకాలు, అవసరమైతే కాంట్రాక్టు నియామకాలే శాశ్వత పరిష్కారమని వైద్య వర్గాలు వాదిస్తున్నాయి. ఈ విభిన్న అభిప్రాయాల మధ్య ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కేవలం పదవీ విరమణ వయస్సు పెంపు అంశానికే పరిమితం కాలేదు. వైద్య విద్యా రంగంలోనే కాకుండా వేలాది మంది వైద్య అధ్యాపకులు, పీజీ పూర్తి చేసిన యువ వైద్యుల భవిష్యత్తును ప్రభావితం చేయనున్న అంశంగా మారింది. పదోన్నతుల విధానం, ఖాళీ పోస్టుల భర్తీ, పీజీ వైద్యుల భవిష్యత్తు, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం, పరిపాలనా పారదర్శకత వంటి అనేక అంశాలు ఇందులో ముడిపడి ఉన్నాయని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి బలమైన గణాంకాలు, సమగ్ర అధ్యయనం, అన్ని వర్గాల అభిప్రాయాలు ప్రాతిపదికగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం స్పందించే తీరుపైనే వేలాది మంది వైద్య అధ్యాపకుల పదోన్నతులు, యువ వైద్యుల ఉద్యోగ అవకాశాలు, వైద్య విద్యా శాఖ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఫైళ్లకే కాదు... అభివృద్ధికీ క్లియరెన్స్!

(మొదటి పేజీ తరువాయి)

లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పిల్లల కంటి వెలుగుకు మంత్రి సత్యకుమార్ సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)



వైద్య ఆరోగ్యశాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా దీన్ని అమలు చేస్తాయన్నారు. కళ్లద్దాలు పంపిణీకి సుమారు రూ. 7 కోట్ల వరకు వ్యయమవుతుందని తెలిపారు

**పథకం అమలు సంతృప్తికరంగా ఉన్నందున...:** గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 95 వేల ఉచిత కళ్లద్దాల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దాన్ని 2.50 లక్షలకు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం కోసం కృషి చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో కంటి అద్దాల పంపిణీ సంతృప్తికరంగా ఉండడంతో కేంద్ర ఆమోదం తెలిపిందని చెప్పారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామన్నారు. తదుపరి వైద్యం అవసరమైన వారిని ప్రభుత్వ నేత్ర వైద్యశాలలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వం గుర్తించిన స్వచ్ఛంద సంస్థల ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయిస్తామని తెలిపారు. చిన్న వయస్సులోనే కంటిచూపు సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే విద్యార్థుల చదువు, ఏకాగ్రత, మానసిక వికాసం మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. దృష్టిలోపం కారణంగా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా చూడడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కంటి పరీక్షలు ప్రతి విద్యార్థికి జరిగేలా జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి సహకరించాలని కోరారు. నివారించగల అంధత్వాన్ని అరికట్టి, ప్రతి విద్యార్థికీ మెరుగైన కంటిచూపు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## భారత్ టెక్స్‌లో 'లేపాక్షి' కళావైభవం!

(మొదటి పేజీ తరువాయి)

3,000 కంటే ఎక్కువ ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలైన శ్రీకాళహస్తి పెన్ కలంకారీ, మచిలీపట్నం బ్లాక్ ప్రింట్ కలంకారీ, నరసాపురం లేస్ వర్క్స్, ఏలూరు కార్పెట్ వర్క్స్ వంటి అద్భుతమైన కళాఖండాలను ప్రదర్శిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సందర్శకులను, ఎగుమతిదారులను, కొనుగోలుదారులను పరిశ్రమల అధినేతలను విశేషంగా ఆకర్షిస్తోంది.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ.."ఆంధ్రప్రదేశ్ యొక్క గొప్ప వస్త్ర వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, మన నేత కార్మికులు, హస్తకళాకారులను అంతర్జాతీయ మార్కెట్‌లతో అనుసంధానించడానికి, ఎగుమతి అవకాశాలను విస్తరించడానికి 'భారత్ టెక్స్--2026' ఒక విశిష్టమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. ఆవిష్కరణలు, మార్కెట్ యాక్సెస్, బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మార్కెటింగ్, ఎగుమతుల ప్రోత్సాహం ద్వారా రాష్ట్రంలో వస్త్ర రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.

ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో లేపాక్షి స్టాల్‌కు దేశీయ, అంతర్జాతీయ సందర్శకుల నుండి అద్భుతమైన స్పందన లభించిందన్నారు. ఇది గ్లోబల్ టెక్స్‌టైల్ పరిశ్రమలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలమైన ఉనికిని చాటడమే కాకుండా, రాష్ట్ర సంపన్న చేనేత వారసత్వాన్ని ప్రపంచ వేదికపై మరోసారి సగర్వంగా నిలబెట్టిందని అన్నారు.

# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్థంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ



సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్, బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌ఓడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన :** 'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలుగు గోడలు దాటి వెళ్లాలి :** ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం.

## పోలవరానికి పర్యాటక శోభ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ జీవనాడి, బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తో పాటు... గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతో పాటు....ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డవలెప్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు. ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవలెప్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ...వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువున నది మధ్యలో 500 ఎకరాల ఐలాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు



ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది. ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్దంచేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్, అధికారులు పాల్గొన్నారు.

## పోర్టుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చేలా రామాయపట్నం, మూలాపేట, మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. మొత్తం 6,248.54 ఎకరాల భూసేకరణ కోసం రూ. 1,638.52 కోట్ల నిధులను ఆమోదించినట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి మంగళవారం సచివాలయంలో వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు రెండో దశ విస్తరణ కోసం 2,924.45 ఎకరాల భూసేకరణకు రూ. 851 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. మూలాపేట పోర్టు విస్తరణలో భాగంగా 1,903.39 ఎకరాల భూసేకరణకు రూ. 440.52 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఉప్పు భూముల సేకరణతో పాటు పునరావాసం, పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) కార్యక్రమాలను కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు రెండో దశ అభివృద్ధికి 1,420.70 ఎకరాల భూసేకరణ కోసం రూ. 347 కోట్లకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు.

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర సముద్ర వాణిజ్య సామర్థ్యం మరింత పెరగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతులు, ఉపాధి అవకాశాలకు ఊతమిస్తాయని మంత్రి పేర్కొన్నారు. పోర్టుల విస్తరణతో తీరప్రాంత జిల్లాల్లో పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఇదే సందర్భంగా తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్న ఈటివాకం గ్రామంలో నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుకు 63.01 ఎకరాల భూమిని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా భూమి కేటాయింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ. 255 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న ఈ లాజిస్టిక్స్ పార్క్ ద్వారా స్థానికంగా సుమారు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయండి

◆ బీజేపీ నేత సోమారపు లావణ్య పిలుపు

**గోదావరిఖని, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి 'సింగరేణి భరోసా యాత్ర'లో భాగంగా నేడు గోదావరిఖనికి విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య పిలుపునిచ్చారు.ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ,నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు,సింగరేణి కార్మికులు,యువత,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర మంత్రికి హృదయపూర్వక ఘన స్వాగతం పలకాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణకు కొంగుబంగారమైన సింగరేణి సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు,దానిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మిక కుటుంబాల భవిష్యత్తుకు కేంద్ర



ప్రభుత్వం తిరుగులేని భరోసా కల్పించిందని ఆమె కొనియాడారు.గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన బొగ్గు బ్లాకుల కేటాయింపుల వివాదాల అనంతరం, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశవ్యాప్తంగా బొగ్గు బ్లాకుల కేటాయింపులు కేవలం వేలం ద్వారానే జరుగుతున్నాయని సోమారపు లావణ్య గుర్తుచేశారు. అలాంటి కఠిన పరిస్థితుల్లోనూ తెలంగాణపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో, సింగరేణి సుస్థిరతను దృష్టిలో ఉంచుకుని దాదాపు 11 సంవత్సరాల తర్వాత ఎలాంటి వేలం లేకుండా నేరుగా కేటాయించిన దేశంలోని ఏకైక బొగ్గు బ్లాక్ "తాడిచర్ల-II" కావడం విశేషమన్నారు. దాదాపు 20 సంవత్సరాలుగా సింగరేణి కార్మికులు, ప్రజాప్రతినిధులు కోరుతున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాబోయే 50 నుండి 60 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తికి పూర్తి భరోసా లభించిందని స్పష్టం చేశారు.ఈ నిర్ణయం సింగరేణి సంస్థ పురోగతికే కాకుండా,తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్న లావణ్య..

ఇంతటి గొప్ప ఊరటనిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా కిషన్ రెడ్డి పర్యటనను భారీ ఎత్తున విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఫిర్యాదు

◆ హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేసు నమోదు చేయాలని పోలీసులకు వినతి

**కరీంనగర్ (ప్రతినిధి, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతలు టూ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపిస్తూ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు.ఫిర్యాదు వివరాల ప్రకారం, జూలై 11న హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో నిర్వహించిన అధికారిక మీడియా సమావేశంలో రాష్ట్రంలో నెలకొనే కరువు పరిస్థితులపై స్పందిస్తూ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతలు కె. చంద్రశేఖర్ రావు, టి. హరీష్ రావు, వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉండటమే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులపై హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 351 (క్రిమినల్ బెదిరింపు), సెక్షన్ 61 (క్రిమినల్ కుట్ర/అబెట్‌మెంట్), సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రేరేపించడం), సెక్షన్లు 192, 196 (సామాజిక విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలు) కింద కేసు నమోదు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, లలిత కుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్, అశ్విని కుమార్ ఉపాధ్యాయ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ, ద్వేషపూరిత ప్రసంగాలపై పోలీసులు స్వయంగా (సువో మోటో) ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి



నుంచి ఇటువంటి వ్యాఖ్యలు రావడం సముచితం కాదని, ఈ వ్యవహారంపై వెంటనే దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబాలకు తగిన భద్రత కల్పించాలని బీఆర్ఎస్ ప్రతినిధులు తమ ఫిర్యాదులో కోరారు.

# జనజాగరణ యాత్రలో గర్జించిన ఉద్యోగులు

- పాత పెన్షన్ పునరుద్ధరించాలని భారీ బైక్ ర్యాలీ
- అశేషంగా తరలివచ్చిన ఉద్యోగ,ఉపాధ్యాయులు
- ఖమ్మం ఉద్యోగుల ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం
- సిపిఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్

**ఖమ్మం, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగులు ముక్తకంఠంతో గర్జించారు.పాత పెన్షన్ అమలు చేయడమే ఏకైక లక్ష్యంగా జన జాగరణ యాత్ర ఖమ్మం చేరుకున్న సందర్భంగా టిఎస్ సిపిఎస్ ఈయూ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ నుంచి పెద్ద ఎత్తున భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం టిఎస్ సీపీఎస్ ఈయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం పై పూర్తి నమ్మకం ఉందని,తమ ఆకాంక్షైన పాత పెన్షన్ అమలు చేస్తారని విశ్వాసంతో ఉద్యోగ,ఉపాధ్యాయులు ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.జనజాగరణ యాత్రలో సంఘాలకు అతీతంగా ఉద్యోగ,ఉపాధ్యాయులు జెండాలను,ఎజెండాలను పక్కన పెట్టి పాత పెన్షన్ పునరుద్ధరించడమే ఏకైక లక్ష్యంగా ఏకమై సత్తాచాటడం శుభసూచకం అన్నారు.

మేనిఫెస్టో అమలుకై ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కి వినతి





పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ఖమ్మం నడిబొడ్డున చేపట్టిన జన జాగరణ యాత్ర రాష్ట్రమంతటికీ దిక్సూచిగా నిలిచిందని టీఎస్ సిపిఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు.పాత పెన్షన్ ఆకాంక్ష ఉద్యోగుల్లో అత్యంత బలంగా ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు అంశాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులు ఆశావాద దృక్పథంతో ఉన్నారని,ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ పునరుద్ధరించే దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు.యాత్రలో భాగంగా ఎమ్మెల్యేల కార్యాలయాలకు ర్యాలీగా చేరుకొని తమ విజ్ఞాపన పత్రాలను సమర్పించారు.దీనిలో భాగంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను క్యాంప్ కార్యాలయంలో కలిసి ఓపిఎస్ పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను వివరించి,మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాన్ని గుర్తు చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు.మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ కూడా పునరుద్ధరిస్తామని సానుకూలంగా స్పందించినట్లు వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్,రాష్ట్ర కార్యదర్శులు మోబీన్ అహ్మద్,రాగి సురేష్, లక్ష్మణాచారి,జిల్లా కోశాధికారి జి.మోహన్,జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.శ్వేత,నాగమణి,జిల్లా నాయకులు బంగారయ్య, క్రాంతి,రాజశేఖర్, శ్రీకాంత్, సుభాన్,సంపత్, సాయికృష్ణ, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, టిపిటిఎఫ్ రాష్ట్ర,జిల్లా బాధ్యులు ఎస్.విజయ్,వెంగళరావు, మల్లయ్య,జ్యూడిషియల్ విభాగం జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,జిపిఓల రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా,డిజేబుల్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్,ఎస్టియూ జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు,తపస్ జిల్లా అధ్యక్షుడు గంధ్ర వెంకటరమణారెడ్డి, జిజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు లింగా నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

# పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు




**రాజన్నసిరిసిల్ల, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు, కొత్త పేర్ల నమోదు మరియు తప్పుల సవరణ కోసం బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓ) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు పిలుపునిచ్చారు.సోమవారం సిరిసిల్లలో నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి మనిషికి ఓటు హక్కు అనేది ఎంతో కీలకమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులకు ప్రజలు సరైన సమాచారం అందించి, ఓటర్ జాబితాలో తమ వివరాలు తప్పులు లేకుండా సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు.

ప్రతి బూత్‌లో కాంగ్రెస్ హెల్ప్ డెస్క్

ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మరియు నమోదు ప్రక్రియలో సహాయం చేయడానికి సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద 'హెల్ప్ డెస్క్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు దేవరాజు ఈ సందర్భంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బూత్ సూపర్‌వైజర్ బొప్ప దేవయ్య, కౌన్సిలర్ లింగంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రమేష్, శ్రావణ్, సబ్బని వేణు, ఇప్పపుల లక్ష్మణ్, బాలరాజు, నాగభూషణం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ గోల్డెన్ టవర్ ముందడుగు



**కరీంనగర్ (ప్రతినిధి, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ ఆధ్వర్యంలో సోమవారం శక్తి సదన్ సెంటర్‌లో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు రూ.5,000 విలువైన బ్యాగులు, అరటిపండ్లు, స్వీట్లు, పాత చీరలు, దుస్తులను అక్కడి అవసరమైన వారికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, అవసరమైన వారికి సేవ చేయడం లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాప శ్రీనివాసరెడ్డి దంపతులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ అధ్యక్షులు లయన్ రంగురాజు, కోశాధికారి లయన్ మండలోజు విజయకుమార్, లయన్ కర్ర వెంకటరమణారెడ్డి, లయన్ ముమ్మాడి శ్రీనివాసాచారి, శక్తి సదన్ ఇన్‌చార్జి దుర్శేటి వసంత, ప్రతిమ హాస్పిటల్ అసిస్టెంట్ మేనేజర్ నారెడ్డి ఇంద్రాకర్ రెడ్డి, హసీంపేట సర్పంచ్, పెగడపల్లి ప్రెసిడెంట్ కంది మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## - అధ్యక్షుడిగా ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శిగా చకినాల రామ్‌మోహన్ రాష్ట్ర కౌన్సిలర్లుగా 16 మంది ఎంపిక



**కరీంనగర్ (ప్రతినిధి, జూలై 14(జర్నలిస్ట్ ఫైల్):** డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) కరీంనగర్ జిల్లా 16వ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో ఉన్న కృషి భవన్‌లో ఘనంగా జరిగింది.సమావేశం అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించగా, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శిగా చకినాల రామ్‌మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా ఏ. దామోదర్, హుమేరా జబీన్, టీ. తిరుపతి గౌడ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఏ. శ్రీనివాస్, ఆర్. శంకరయ్య, బి. రమేష్, ఎస్. చక్రధర్ బాధ్యతలు చేపట్టనున్నారు.ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యు. శంకర్, సభ్యులుగా ఎం. సత్యనారాయణ రెడ్డి, బి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. రాజిరెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె. నారాయణ రెడ్డి, ఎం. రఘుశంకర్ రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి కె. చంద్రమౌళి ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఏ. శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల పరిశీలకుడిగా బి. శ్యామ్ వ్యవహరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న డీటీఎఫ్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.అదేవిధంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లుగా 16 మందిని ఎన్నుకున్నారు. వారిలో కె. నారాయణ రెడ్డి, ఎం. రఘుశంకర్ రెడ్డి, వి. రాజిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, దేవేందర్, తూముల తిరుపతి, కేషన్ రెడ్డి, సంపతి, రాజమౌళి, సముద్రాల అంజయ్య, జయప్రద గౌతమి, సదానందం, రాంకిరణ్, అరుణ, నరసింహారెడ్డి, మొహినుద్దీన్ ఉన్నారు.నూతన జిల్లా కమిటీ ఎన్నికతో డీటీఎఫ్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

# ఎస్ఐఆర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోండి

**కొత్తగూడెం జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటు హక్కు ప్రతి ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన హక్కని, దానిని పరిరక్షించుకోవాలంటే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో ప్రతి అర్హుడు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఎండి.రజాక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ పేరు నమోదు చేసుకోకపోతే, అవసరమైన వివరాలను సమర్పించకపోతే భవిష్యత్తులో ఓటరు జాబితాలో పేరు లేకపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కోల్పోయేప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.18 సంవత్సరాలు నిండిన యువత వెంటనే ఓటరు నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలోఉన్న వారు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగంచేసుకోని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి స్వచ్ఛమైన,ఖచ్చితమైన ఓటరు జాబితాలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలందరూ అవగాహనతో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గని ఇతరులను కూడా చైతన్యపరచాలని విజ్ఞప్తి చేశారు.

## కేంద్రమంత్రి, ఎమ్మెల్సీని కలిసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జేఏసి



**కొత్తగూడెం జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెం పర్యటనకు వచ్చిన కేంద్రబగ్గు, గనులశాఖామంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్మయి అంజిరెడ్డిని తెలంగాణరాష్ట్రఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జేఏసి ప్రతినిధులు సోమవారం కలిశారు. రాష్ట్రజేఏసి చైర్మన్, అధ్యక్షులు పులి లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలకసమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందచేశారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ఔట్‌సోర్సింగ్‌కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను దోపిడీచేస్తున్న పరిస్థితులు ఆందోళనకరమని అన్నారు. తక్కువ వేతనాలు, జీతాల ఆలస్యం, ఏజెన్సీల దోపిడీ కారణంగా ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొంతమంది అధికారులు కూడా ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించబోమని హెచ్చరించారు. ఏజెన్సీల వ్యవహారాలపై జరుగుతున్న ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని, అవసరమైతే సంబంధిత ఏజెన్సీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు బోనగిరి రవికిరణ్, ఎల్పుల సుధాకర్, కార్తీక్, మౌలిష్, శ్రీనివాస్, పార్థు, వెంకట్రావు, సురేష్, అజయ్ తదితరులు పాల్గున్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## - శిక్షణా తరగతులను సందర్శించిన విద్యాధికారి వాసంతి



**కొత్తగూడెం, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ని ఉపయోగించుకోని ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి డి.వాసంతి తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ పాల్వంచలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులకు స్పెల్-2 శిక్షణా తరగతులను ఆమె సోమవారం సందర్శించారు.అనంతరం విద్యాధికారి ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ తరగతుల పాఠ్యాంశాలలోని లెర్నింగ్ అవుట్‌కమ్‌లను విద్యార్థుల చేత సాధింప చేయడం అత్యంత ముఖ్యమని తెలిపారు. దీని ద్వారా జిల్లాకు సంబంధించిన ర్యాంకును మెరుగుపర్చడం సాధ్యమవుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని ఉపాధ్యాయులు తమ బోధనలోఉపయోగించుకోని టీచింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు కూడా ఏఐ వినియోగంపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందేందుకు సహకరిస్తుందని తెలిపారు. ఈశిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను సమర్థంగా తరగతి గదిలో అమలు చేసి బోధన నైపుణ్యాలను మెరుగుపర్చాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.ఇంగ్లీష్ మీడియం పాఠ్యాంశాలను ఇంగ్లీష్‌లోనే బోధించడం ద్వారా విద్యార్థులలోస్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ మోనిటరింగ్ అధికారి మాధవరావు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గున్నారు.

# వికె కోల్‌మైన్స్ నందు గేట్ మీటింగ్ : ఐఎన్టీయుసి



**కొత్తగూడెంసింగరేణి జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఐఎన్టీయుసి సెక్రెటరీ జనరల్ తెలంగాణరాష్ట్రకనీస వేతనాల చైర్మన్ బి.జనక్‌ప్రసాద్ సూచనల మేరకు ఏరియాలోని వికె కోల్‌మైన్స్ నందు ఫిట్‌కార్యదర్శి గోపుకుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమానికి ఐఎన్టీయుసి వైస్‌ప్రెసిడెంట్ ఎండి.రజాక్ పాల్గని మాట్లాడుతూ తాడిచర్ల -2సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని, దీనికి ఐఎన్టీయుసి జాతీయ నాయకులు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌లు సిఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సిఎం పలు దఫాలుగా కేంద్ర మంత్రులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వివరించి తాడిచర్ల -2 బగ్గుబ్లాక్ తీసుకురావడం జరిగిందన్నారు. గత నెలలో రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఏరియాలో ఉన్న ఇంటిస్థలాల గురించి వివరించడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారన్నారు.ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, జీడుల రాజేశ్వరరావు, విప్లవకుమార్, శ్రీనివాస్, భీముడు, కృష్ణమోహన్, రాజశేఖర్, భరత్, దుర్గాసింగ్, లక్ష్మణ్‌రాజు, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, మొయినుద్దీన్, శ్రీనివాస్, వసంత్రావు, వెంకటస్వామి, హనుమంతు, రహీం, అబ్దుల్‌రెహ్మాన్, రాజేశ్వరరావు, రామకృష్ణ, శ్రవణ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నవీన్, బాబురావు, రామస్వామి, కనకం కుమార్, ఈశ్వరయ్య, శ్రీనివాస్, చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గున్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు

## - గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**లక్ష్మీదేవిపల్లి జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకుయాంటీడ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతోపాటు, గంజాయి వినియోగం, విక్రయం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈనేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోతువాగు ప్రాంతంలోప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి కేసు నమోదు చేశారు.గంజాయి వల్ల కలిగే ఆరోగ్య, మానసిక కుటుంబ,సామాజిక దుష్పరిణామాలపైప్రత్యేకంగా అవగాహన కల్పించి భవిష్యత్తులో మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని డీ-అడిక్షన్‌సెంటర్‌కు తరలించారు. ఈసందర్భంగా డిఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణలోపోలీసులు రాజీ పడే ప్రసక్తే లేదని, యువత భవిష్యత్తును కాపాడడం కోసం ఒకవైపు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోవైపు చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులకు సహకరించాలన్నారు.సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా, డయల్ -112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చుంచుపల్లి సిఐ ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్ఐ అఖిల, పోలీస్‌సిబ్బంది పాల్గున్నారు.

# ఎల్,ని,నో ప్రభావంతో నష్టపోతున్న రైతులకు ఆర్థిక ప్రోత్సాహం కల్పించాలి : దొండపాటి



**కొణిజర్ల(జర్నలిస్ట్ ఫైల్):** ఎల్,ని,నో, ప్రభావం నుండి పంటలకు ప్రభుత్వాల ప్రోత్సాహం ద్వారా రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం కింద,ఎకరానికి 8000 రూపాయలు ఇచ్చి వ్యవసాయంలో రైతులు నిలబడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ సహాయ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం కొణిజర్ల మండల రైతు సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన రైతుల ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించి చట్టబద్ధంగా ఏర్పాటు చేయటం ద్వారా వ్యవసాయ రంగం బలోపేతం కాగలదని వారు పేర్కొన్నారు. ఈ దేశానికి అన్నం పెట్టే రైతు ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు పాలకులకు ఎంతైనా అవసరం ఉందని వారు గుర్తు చేశారు. ఇప్పటికే అతి తక్కువ వర్షాలకు విత్తనాలు వేసి నా,పంటలు 30 శాతం మొలకెత్తిన మొక్కలను కాపాడుకోవడానికి వర్షాలు లేకపోవడంతో నీటి వనరులు అవకాశాలు అందుబాటులోకి రాకపోవటం రైతులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని నష్టపోయిన పంటలకు పంటల భీమా పథకం ద్వారా పంట నష్టపరిహారం రైతులకు అందించాలని వారు ప్రభుత్వాలను వారు కోరారు. పంట సాగు కు,సరిపడా అన్ని రకాల విత్తనాలు అందుబాటులో రైతులకు ఉంచాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయతో, కాలం గడపకుండా తక్షణ చర్యలకు సిద్ధం కావాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వ్యవసాయం బాగుంటేనే ఈ దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, రైతులు రైతును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ప్రభుత్వ పాలకులు మీద ఉందని వారు గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే పని చేయటం మానేసి ప్రచారమే ప్రాణపాయంగా ప్రభుత్వాలు కొనసాగిస్తూ కోట్ల రూపాయలను వృధాగా ఖర్చు చేస్తూ కాలం గడిపేసే ప్రభుత్వ పాలకుల ఆలోచనలు సరైంది కాదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్, పుట్టా సత్యనారాయణ, చింతల ఆదినారాయణ, అడపా కృష్ణయ్య, దొబ్బన పోయిన శేషయ్య, ఎర్ర కేశవులు, తాతా బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ముఖ్యమంత్రి కి కొణిజర్ల తాసిల్దార్ అరుణ ద్వారా సాగునీరు, లేక ఎల్,ని,నో ప్రభావానికి పంటలు నష్టపోయి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రోత్సాహ కంగా ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రకటించాలని కోరారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం,జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ





**వైరా ,జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఎంతో కీలకమైన కార్యక్రమమని అన్నారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాల విద్యార్థులందరూ ప్రభుత్వ సూచనల మేరకు నులిపురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా, చైతన్యవంతంగా ఎదిగి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహాసభలలో కవి లెనిన్ శ్రీనివాస్ కు ఘన సత్కారం





**ఖమ్మం,జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

విజయవాడలో గత రెండు రోజులుగా 2026 జూలై 11 12 శని ఆదివారాలలో కొత్తపేట కె.బి.ఎన్ కళాశాలలో అత్యంత వైభవంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా మూడవ ప్రపంచ రచయిత్రుల మహాసభలు జరిగాయి ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సభా ప్రాంగణ వేదికలలో అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి మూడవ వేదిక ఇల్లందుల సరస్వతి దేవి కవి సమ్మేళన వేదికకు ఈ రెండు రోజుల కార్యక్రమ కన్వీనర్ గా మహాసభల కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శిగా సేవలందించిన ప్రజాకవి లెనిన్ శ్రీనివాసును రెండవ రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో సభాధ్యక్షులుగా మాజీ రాజ్యసభ సభ్యులు పద్మ భూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అధ్యక్షతన వైస్ చాన్సులర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ఆచార్య కె ఆర్ రజనీ ఛైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఛైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ సృజనాత్మక మరియు సంస్కృతి సమితి బోయపాటి తేజస్విని శాసనసభ్యులు అవనిగడ్డ డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ డాక్టర్ గుత్తికొండ సుబ్బారావు డాక్టర్ జీవి పూర్ణచంద్ కేబీఎన్ కళాశాల యాజమాన్యం డాక్టర్ వి నారాయణరావు నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు తేళ్ల అరుణ మహాసభల నిర్వహణ కమిటీ బాధ్యురాలు కరెడ్ల సుశీల మొదలగు ప్రముఖుల చేతుల మీదుగా వికాస వేదిక సాహిత్య సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ సాహితీ సేవలకు ప్రశంసిస్తూ ఘనంగా సత్కరించారు.ఇంకా ఈ సభలో సమన్వయ కమిటీగా బాధ్యతలు నిర్వహించిన వికాస వేదిక సాహిత్య సంస్థ ఖమ్మం జిల్లా కార్యదర్శి తిరునగరి శ్రీనివాసరావు సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడవల్లి శైలజ లను సభ సత్కరించింది ఈ సందర్భంగా ఈ సందర్భంగా సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్నందుకు వీరిని సాహితీ ప్రముఖులు ప్రశంసించి అభినందనలు తెలియజేశారు.

# సింగరేణికి 'తాడిచెర్ల' నలుదిశలా హర్షాతిరేకాలు



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** దక్షిణ భారతదేశానికి వెలుగులు పంచే సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల బొగ్గు గనిని కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సింగరేణి కార్మికుల పక్షాన నిలిచి, బొగ్గు గనిని కేటాయించిన ఈ శుభ పరిణామం అనంతరం తొలిసారిగా ఖమ్మం గడ్డపై అడుగుపెట్టిన భారతీయ జనతా పార్టీ అగ్రనేతలకు జిల్లా ప్రజానీకం, పార్టీ శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. సోమవారం జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు, ఎంపీ డీకే అరుణ, ఎంఎల్ఏ ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితర హేమాహేమీలకు జిల్లావ్యాప్తంగా అపూర్వ, ఘన స్వాగతం లభించింది.నాయకుల రాకతో కూసుమంచి మండలం నాయకుని గూడెం టోల్ ప్లాజా వద్ద పండుగ వాతావరణం నెలకొంది. భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు అగ్రనేతలకు ఘనంగా స్వాగతం పలికారు. పూల మాలలు,శాలువాలతో వారిని సత్కరించి తమ అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అల్పాహార విందులో నేతలు, కార్యకర్తలు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అక్కడినుంచి భారీ కాన్వాయ్‌తో ముందుకు సాగిన అగ్రనేతలకు ఖమ్మం నగర లో పార్టీ అభిమానులు పూల వర్షం కురిపించి బ్రహ్మరథం పట్టారు. అక్కడినుండి వైరా చేరుకున్న నేతలకు డప్పుల దరువులు, కోలాటాల నడుమ సాంప్రదాయబద్ధంగా సాదర స్వాగతం లభించింది. తల్లాడలో అయితే నాయకుల రాకను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు అంబరాన్నంటేలా చేశారు. పూలమాలలతో నేతలను ముంచెత్తారు. అగ్రనేతల రాకతో అడుగడుగునా కనిపించిన ఈ ఉత్సాహం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీజేపీ శ్రేణుల్లో సరికొత్త జోష్‌ను నింపింది.పండుగలా సాగిన ఈ స్వాగత కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ముల్కం కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, రాష్ట్ర కార్యదర్శి బద్ద మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావు, అంజి రెడ్డి, విశేషంగా పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర సీనియర్ నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు వాకధాని పుల్లారావు యాదవ్, నంబూరి రామలింగేశ్వరరావు, సన్నీ ఉదయ ప్రతాప్, గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వరరావు, రుద్ర ప్రదీప్, నంబూరి రామలింగేశ్వర రావు, గుత్తా వెంకటేశ్వర్లు, దొంగలు సత్యనారాయణ, మండడపు సుబ్బారావు, నున్న రవికుమార్ , గెంటేల విద్యా సాగర్, వీరవెల్లి రాజేష్, ఇవి రమేష్, నాయుడు రాఘవరావు,మేకల నాగేందర్,బండారు నరేష్ రవి రాథోడ్, నకిర కంటి వీరభద్రం, వీరం రాజు, కందుల శ్రీకృష్ణ, మంద సరస్వతి, విజయ రెడ్డి , శ్రీలక్ష్మి ,తదితర ముఖ్య నేతలు, వేలాది మంది కార్యకర్తలు ఈ మహా స్వాగత వేడుకలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

# సిద్దాపూర్ లో డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా మహా ధర్నా

## -వరదలా జాతీయ రహదారిపైకి దూసుకొచ్చిన జనం





**షాద్నగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** విన్నవించారు.. వినతులూ అందించారు.. ధర్నాలు చేశారు.. ర్యాలీలూ నిర్వహించారు.. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా తన పంతా మార్చుకోని ప్రభుత్వం తీరుపై ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు పెల్లుబీకాయి.. పార్టీలకు అతీతంగా నేతలు చేతులు కలిపారు.. మహా ధర్నాకు పిలుపునిచ్చారు.. 20 గ్రామాల ప్రజలు తరలివచ్చి జాతీయ రహదారిని దిగ్బంధించారు.. తమ కడుపు మంటను రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించేలా గట్టిగా నినదించారు. ఇది.. రంగారెడ్డి జిల్లా కొత్తూరు పురపాలక కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్న ఘటన. వివరాల్లోకి వెళితే.. సిద్దాపూర్ ఏకో టౌన్షిప్ (డంపింగ్ యార్డ్) ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 641 ను రద్దు చేయాలని కొంతకాలంగా ప్రభావిత ప్రాంతాలైన కొత్తూరు, కేశంపేట, మహేశ్వరం మండలాల్లోని సుమారు 20 గ్రాముల ప్రజలు అర్థించారు. అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడంతో సొంత పార్టీ నేతలే తిరుగు బావుట ఎగురవేశారు. కలిసి వచ్చిన పార్టీల నేతలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేశారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులను కలిశారు. నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి నేతల వరకు వినతులు సమర్పించారు. గల్లీలు మొదలు తండాల్లో, పల్లెల్లో తిరుగుతూ ర్యాలీలు చేపట్టారు. చౌరస్తాల్లో ధర్నాలు నిర్వహించారు. అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడంతో జనం తమ ఆవేశాన్ని అదుపు చేసుకోలేకపోయారు. ఫలితంగా..

**ఆర్డీవో కు వినతి సమర్పించాలని..**

చివరిసారిగా షాద్ నగర్ ఆర్డీవో కు వినతి పత్రం సమర్పించి తమ గోడు వెల్లబోసుకోవాలని జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం బాధిత గ్రామాల ప్రజలు సిద్దాపూర్ లో సమావేశమయ్యారు. జేఏసీ చైర్మన్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, భాజపా నియోజకవర్గ ఇన్చార్జి అందే బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గం ఇన్చార్జి రమేష్, సిపిఎం నాయకులు రాజు, సాయిబాబా, ఎల్ హెచ్ పి ఎస్, ఎమ్మార్పీఎస్, ఇతర ప్రజా సంఘాల నేతలు డంపింగ్ యార్డ్ వల్ల కలిగే అనర్థాలను మరోసారి ప్రజలకు వివరించారు. అనంతరం వాహనాల్లో ఆర్డీవో ఆఫీసుకు ర్యాలీగా తరలి వెళ్లేందుకు బయలుదేరారు.

**వాహనాలను అడ్డగించిన పోలీసులు**

పోలీసులు వాహనాల శ్రేణిని అడ్డగించడంతో నిరసనకారులు సిద్దాపూర్ నుంచి శేరిగూడ భద్రయ్యపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి వాహనాల ద్వారా కొత్తూరు బైపాస్ కు చేరుకుని 44వ జాతీయ రహదారిని దిగ్బంధించారు. అనూహ్య పరిణామంతో కంగుతిన్న పోలీసులు నిరసనకారులను బలవంతంగా డీసీఎం వాహనాల్లో పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులంతా ఓచోట ఉండగా ఆందోళనకారులు మరో గ్రూపుగా విడిపోయి వైజంక్షన్ లో జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**పోలీసులపై తిరగబడ్డ జనం**

నిరసనకారులను అదుపు చేసే క్రమంలో ఒకానొక సమయంలో గిరిజన మహిళలు పోలీసులపై తిరగబడ్డారు. పురుషులను పోలీసులు లాక్కుని వెళుతుండగా వెనక నుండి పోలీసులను మహిళలు అదుపు చేయడం కనిపించింది. ఓ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రోడ్డుపై బోర్లా పడిపోయాడు. ఆగ్రహించిన పోలీసులు మీడియా ప్రతినిధులను సైతం వాహనాల్లో ఎక్కించి స్టేషన్ కు తీసుకెళ్లారు. మొత్తంగా రెండున్నర గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

# గజ్వేల్ బీఎంఎస్ ఇంచార్జ్ మరాఠి కృష్ణమూర్తికి ఘన సన్మానం

**గజ్వేల్, (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గజ్వేల్ ఇంచార్జ్ మరాఠి కృష్ణమూర్తిని మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రేజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమం కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సమాజ సేవలో మరాఠి కృష్ణమూర్తి చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మరాఠి కృష్ణమూర్తి మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# భారతదేశ అగ్రిటెక్ ఆవిష్కరణల వ్యవస్థను ప్రదర్శించడానికి అంతర్జాతీయ ఐటిఈసి ప్రతినిధి బృందానికి ఆతిథ్యం -ఎ-ఐడియా,ఐసిఏఆర్-నార్మ్

**ఖమ్మం, జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారతదేశ అగ్రిటెక్ ఆవిష్కరణల వ్యవస్థను ప్రదర్శించడానికి అంతర్జాతీయ ఐటిఈసి ప్రతినిధి బృందానికి ఆతిథ్యం ఇచ్చిన ఎ-ఐడియా,ఐసిఏఆర్-నార్మ్భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఐసిఆర్ ఐఎస్ ఏటి నిర్వహిస్తున్న 'సుస్థిర అభివృద్ధి కోసం వ్యవసాయంలో ఆవిష్కరణలు,వ్యవస్థాపకతను పెంపొందించడం' పై ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటిఈసి) అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం కింద 24 దేశాల నుండి 46 మంది ప్రతినిధులతో కూడిన అంతర్జాతీయ బృందానికి యొక్క టి.బి.ఐ అయినఐసిఏఆర్-నార్మ్ ఎ-ఐడియా జూలై 13, 2026 న ఆతిథ్యం ఇచ్చింది.ఈ ప్రతినిధి బృందంలో 24 దేశాలకు (అల్జీరియా,బంగ్లాదేశ్,కోట్ డి ఐవరీ,క్రొయేషియా,డొమినికా,ఈజిప్ట్,ఫిజీ,ఘనా,గినియా,కెన్యా,లెబనాన్,లైబీరియా,మలావి, మాలి, మారిష స్, మొజాంబిక్, నేపాల్, నైజీరియా, ఒ మ న్, సియెర్రా లియోన్,శ్రీలంక,తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్,జాంబియా) చెందిన 46 మంది విశిష్ట ప్రతినిధులు (వ్యవసాయ నిపుణులు,పరిశోధకులు,విధాన నిర్ణేతలు,విద్యావేత్తలు) ఉన్నారు.భారతదేశ వ్యవసాయ ఆవిష్కరణల వ్యవస్థ,అగ్రిటెక్ వ్యవస్థాపకతను ప్రోత్సహించడంలో బిజినెస్ ఇంక్యుబేషన్ పాత్రపై ప్రతినిధులు ప్రత్యక్ష అవగాహన పొందడానికి ఈ పర్యటన ఒక అవకాశాన్ని అందించింది.ఐసిఏఆర్-నార్మ్ ప్రధాన శాస్త్రవేత్త మరియు ఎ-ఐడియా సీఈఓ డాక్టర్ రంజిత్ కుమార్ ఎ-ఐడియా యొక్క ఇంక్యుబేషన్ వ్యవస్థ గురించి సమగ్ర అవలోకనాన్ని అందించారు.అగ్రిటెక్ స్టార్టప్‌లను పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాణిజ్యీకరించడం,అగ్రిప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం,ఆవిష్కరణల ఆధారిత వ్యవసాయ అభివృద్ధిని బలోపేతం చేయడంలో దాని చొరవలను ఆయన హైలైట్ చేశారు.ఎ-ఐడియా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పూజ ఎస్. భట్, వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్న ఎ-ఐడియా




ఇంక్యుబేటెడ్ స్టార్టప్‌లు అభివృద్ధి చేసిన వినూత్న ఉత్పత్తులు,సాంకేతికతలను ప్రదర్శించారు.ఐసిఏఆర్-నార్మ్ డైరెక్టర్, ఎ-ఐడియా ప్రెసిడెంట్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం..స్థితిస్థాపకత,సుస్థిరమైన వ్యవసాయ-ఆహార వ్యవస్థలను నిర్మించడంలో ఆవిష్కరణలు,పరిశోధనలు,అంతర్జాతీయ భాగస్వామ్యాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.వ్యవసాయ పరిశోధన,వ్యవస్థాపకతలో భారతదేశం సాధించిన పురోగతిని ఆయన వివరించారు.సైన్స్,టెక్నాలజీ,ఆవిష్కరణల ద్వారా వ్యవసాయంలో ఎదురవుతున్న ఉమ్మడి సవాళ్లను పరిష్కరించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య మరింత సహకారం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.పాల్గొన్న ప్రతినిధులు ఐసిఏఆర్-నార్మ్ ఎ-ఐడియా నాయకత్వంతో ఆలోచనలను పంచుకున్న ఇంటరాక్టివ్ సెషన్‌తో ఈకార్యక్రమం ముగిసింది.జ్ఞాన మార్పిడి,వ్యవస్థాపకత ప్రోత్సాహం,సామర్థ్య పెంపొందింపు ద్వారా ఆవిష్కరణల ఆధారిత వ్యవసాయ పరివర్తనను పెంపొందించడానికి,ప్రపంచ భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి ఎ-ఐడియా యొక్క నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేసింది.

# ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని కే.కే.కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతిపత్రం అందజేసిన మంచర్ల శ్రీనివాస్.



**రాజేంద్రనగర్,జూలై 14 (జర్నలిస్ట్ ఫైల్)**ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని కే.కే.కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతి పత్రం అందజేసిన మంచర్ల శ్రీనివాస్ శంషాబాద్ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి,ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఉద్యమకారుడు మంచర్ల శ్రీనివాస్ కే.కే.కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతిపత్రం అందజేశారు.హైదరాబాద్‌లోని అమరజ్యోతి కార్యాలయంలో కే.కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన రంగారెడ్డి,మహబూబ్‌నగర్,హైదరాబాద్ జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో సంవత్సరాలు ఉద్యమకారులు తమ సమయం,శ్రమ,జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా,ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ ఫలితాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శంషాబాద్ మండలంలోని ఉద్యమకారులందరినీ గుర్తించి, ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి,ఉద్యమకారులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోదండరాంను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చిన్నగండు రాజేందర్,సాలివేంద్రి వెంకట్ రెడ్డి, వీరమల్ల హన్మంత్ ముదిరాజ్,ఆర్.కే.తో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# కొప్పునూర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన తహాశీల్దార్ శ్రీనివాస్



**వనపర్తి (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నంబావి పరిధిలోని కొప్పునూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఏఎన్ఎం జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్న, మాజీ సర్పంచ్ జంగ బిచుపల్లి యాదవ్ పాల్గొని విద్యార్థులకు మాత్రలను అందజేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల నులిపురుగుల సమస్య నుంచి రక్షణ పొందడంతో పాటు పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడుతుందని, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, జూలై 13న తెలంగాణ వ్యాప్తంగా మాత్రల పంపిణీ విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఏదైనా కారణంతో మాత్రలు తీసుకోలేని పిల్లల కోసం జూలై 20న 'మాప్-అప్ డే' నిర్వహించనున్నట్లు తెలిపారు.వైద్య శాఖ సూచనల ప్రకారం, 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటిలో కలిపి ఇవ్వాలని, 2 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు ఒక పూర్తి మాత్రను పొడి చేసి ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఒక పూర్తి మాత్రను నమిలి మింగిన తర్వాత నీరు తాగాలని సూచించారు.మాత్రలను ఖాళీ కడుపుతో కాకుండా భోజనం చేసిన అనంతరం మాత్రమే తీసుకోవాలని వైద్య అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవాలి

## - గడ్డం శేఖర్ యాదవ్.



**రాజేంద్రనగర్, (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వామ్యులై ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని నర్కూడ గ్రామపంచాయతీ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన నర్కూడ గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై గ్రామ ప్రజలకు, మహిళలకు, మహిళా మండలి గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా ప్రతి ప్రతిరోజు ప్రజల మధ్యలో ఉండి వారి ఓటు హక్కు కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీకు సహాయం అందించేందుకు బి ఎల్ ఓ లు, గ్రామ పంచాయతీ సెక్రటరీ, గ్రామపంచాయతీ పాలకవర్గం, ఎస్ ఐ ఆర్ కు సంబంధించిన స్టాఫ్, గ్రామపంచాయతీ స్టాప్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# ఈ నెల 24 వరకు ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమం పొడిగింపు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించినట్లు గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కె. మయూర్ అశోక్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 28లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, మార్పులకు కూడా అవకాశం ఉందన్నారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ బీఎల్ఓలకు అందజేయాలని, బీఎల్ఓలు అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని సూచించారు.

# గుంటూరులో రెండు చోట్ల పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



- తొమ్మిది మంది పట్టివేత.. నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): గుంటూరు జిల్లా మేడికొండూరు, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్రపాడు గ్రామ శివారులో మూడుమల్ల చేను వద్ద పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో కలిసి దాడి నిర్వహించారు. పోలీసులను గమనించిన ఆరుగురు పరారవగా, ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 6,320 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొర్రపాడుకు చెందిన వ్యక్తిని పేకాట నిర్వాహకుడిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

అదేరోజు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రత్నగిరి నగర్ రైల్వే కట్ట సమీపంలోని ఓ రేకుల ఇంటిలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 6,240 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వస్తువులు, పట్టుబడిన వారిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

# పార్వతీపురం మన్యం జిల్లాలో బీజేపీ పదాధికారుల సమావేశం




- పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చ

పార్వతీపురం(జర్నలిస్ట్ ఫైల్ ): పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ పదాధికారుల ముఖ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జిగా తన తొలి సమావేశంలో పొలిమేర శ్రీనివాసరావు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు. తొలి సమావేశం సందర్భంగా పరస్పర పరిచయ కార్యక్రమం నిర్వహించి, జిల్లాలో పార్టీ సంస్థాగత బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించడంతో పాటు బూత్ స్థాయి కమిటీల (బీఎల్ఏ-1) పనితీరును సమీక్షించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలను క్షేత్రస్థాయికి సమర్థంగా అమలు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా పదాధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన పొలిమేర శ్రీనివాసరావుకు నాయకులు ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్

- ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్లా మాధవి తెలిపారు.

మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో గంజాయి వినియోగం, విక్రయాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు ఫిర్యాదు చేయడంతో వెంటనే పోలీసులను అప్రమత్తం చేసి నైట్ బీట్ కానిస్టేబుళ్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయించామని, దీంతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. మహిళలు చిన్నా పెద్దా ఏ సమస్యనైనా నేరుగా వచ్చి చెప్పుకునే వేదికగా ఈ కార్యక్రమం మారిందని, పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యే వరకు నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని చెప్పారు.

విద్యార్థినులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా పారిశుద్ధ్య సమస్యలు, వైన్ షాపుల వద్ద ఆకతాయిల వేధింపులు, వీధి దీపాల కొరత, ఆర్థిక మోసాలు, కుటుంబ వివాదాలు, వృద్ధ మహిళల ఆస్తుల ఆక్రమణ ప్రయత్నాలు, దొంగతనాల వంటి అంశాలపై అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరిస్తున్నామని గళ్లా మాధవి తెలిపారు.

ఇబ్బంది పెడుతున్న ఘటనల్లో కూడా జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, యువతులకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, పీ-4 కార్యక్రమం ద్వారా పుస్తకాలు, బ్యాగులు, విద్యా సామగ్రి అందించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం గుంటూరు ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మహిళల భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సాయుధ గార్డు గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించింది. అనంతరం రిసెప్షన్, కౌన్సెలింగ్ గదులు, స్టేషన్ పరిసరాలు, ఎస్‌టీఎఫ్ కార్యాలయం, సిబ్బంది డార్మిటరీలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, సమస్యలను తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఆలస్యం లేకుండా నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి త్వరితగతిన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులను సమీక్షించి వాటిని ప్రాధాన్యంతో పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, రిజిస్టర్లు, మాల్ఖానా నిర్వహణ, సీసీటీఎన్ఎస్ నమోదులను పరిశీలించి అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని చెప్పారు. మహిళా బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, కుటుంబ వివాదాల్లో సమర్థవంతమైన కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు చట్టపరమైన కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. గుంటూరు టౌన్‌తో పాటు జిల్లాలోని శక్తి బృందాల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించాలని ఉమెన్ పోలీస్ డీఎస్పీకి ఆదేశించారు. ఈ తనిఖీలో ఉమెన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు అంజయ్య, రమేష్, ఎస్‌బీ సీఐ-1 మల్లికార్జునరావు, ఎస్ఐలు భవాని, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

# 'సంకల్పం'తో విద్యార్థులకు అవగాహన కల్పించిన నల్లపాడు పోలీసులు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చౌడవరంలోని కళ్ళం హరినాథ్ రెడ్డి విద్యాసంస్థలో మంగళవారం 'సంకల్పం' పేరుతో మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనమని, వాటి వినియోగం శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక సమస్యలతో పాటు చట్టపరమైన ఇబ్బందులకు దారితీస్తుందని వివరించారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, ర్యాగింగ్ వంటి నేరాలపై అవగాహన కల్పించి, అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను వినియోగించాలని విద్యార్థినులకు సూచించారు.

సైబర్ నేరాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింకులు, ఓటీపీ మోసాలు, క్యూఆర్ కోడ్ స్కాములు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ తెలియజేయవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో పాటు నల్లపాడు సీఐ భాస్కర్, ఎస్సై రామకృష్ణ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లైఫ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహనగదు బహుమతులు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): మండల గ్రామమైన కట్టెవరం లోనీ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థిని విద్యార్థులకు లైఫ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహనగదు ను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు మధు కోనేరు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచనతో లైఫ్ కేర్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేయటం జరిగిందని ఆమె తెలియజేశారు. పదో తరగతిలో పబ్లిక్ పరీక్షల్లో(2025-26) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు ఒక్కొక్కరికి 2000 రూపాయల చొప్పున ప్రోత్సాహ నగదు బహుమతిని అందజేయటం జరిగిందని ఆమె పేర్కొన్నారు. విద్య ద్వారానే వారి యొక్క భవిష్యత్తు మారుతుందని ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలనీ ఆమె కోరారు. హై స్కూల్ హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ చేతుల మీదగా లైఫ్ కేర్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేయటం అభినందనీయమని ఆయన తెలియజేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో కత్తివరం జడ్పీ హెచ్ స్కూల్ నందు చదివిన విద్యార్థిని విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన అశ్విత్, సంజన,లహరి లకు ఒక్కొక్కరికి 2000 రూపాయలను ప్రోత్సాహ నగదు బహుమతులను అందజేయటం సంతోషమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నైపుకర్ ఫౌండేషన్ నిర్వాహకులు భీమనేని వేణుబాబు, మధిర రాజు, ఆషా, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, నగదు బహుమతులు పొందిన తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు సత్యాలు పాల్గొన్నారు.

# మై భారత్ పోర్టల్‌లో విద్యార్థుల నమోదును వేగవంతం చేయాలి: జేసీ ఆశుతోష్ శ్రీవాస్తవ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ పోర్టల్‌లో విద్యార్థులు, యువత నమోదును వేగవంతం చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జూలై 1 నుండి ఆగస్టు 15 వరకు నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ రిజిస్ట్రేషన్ ఴ అవగాహన డ్రైవ్ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని, ప్రతి కళాశాలలో మై భారత్ నోడల్ అధికారులను నియమించి, మై భారత్ చాప్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, వృత్తి విద్యార్థులతో పాటు గ్రామీణ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల నమోదుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అలాగే ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి డీఆర్డీఏ నైపుణ్యాభివృద్ధి శాఖ, సమాచార శాఖ తదితర విభాగాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు ద్వారా యువతకు స్వచ్ఛంద సేవ, నాయకత్వ శిక్షణ, జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు కేంద్ర ప్రభుత్వ ఈ-సర్టిఫికెట్లు లభిస్తాయని పేర్కొంటూ, గుంటూరు జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రం లో మేర యువ భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు దేవిరెడ్డి కిరణ్మయి, జిల్లా ఎన్ఎన్ ఎస్ ప్రోగ్రాము అధికారి సునీల్ సి ఈ ఓ స్టెప్ మేనేజర్ రాధికా తదితర అధికారులు పాల్గొన్నారు.

# 1600 మంది విద్యార్థులకు రూ.55 లక్షల ఉపకార వేతనాలు




- ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు పంపిణీ

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): పేద విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలనే సంకల్పంతో ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్న ప్రవాస ఆంధ్రుడు ఏరువ సాయిరాం, ఈ ఏడాది 1,600 మంది విద్యార్థులకు రూ. 55 లక్షలకు పైగా ఉపకార వేతనాలు అందించనున్నారు. గుంటూరు రూరల్ మండలం పెద్ద పలకలూరుకు చెందిన సాయిరాం, చిన్నతనంలో విద్యాభ్యాసం కోసం పడిన కష్టాలను గుర్తు చేసుకుంటూ 2001 నుంచి పేద, అనాథ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 2012 నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఇంటర్, బీటెక్, ఎంబీబీఎస్ తదితర కోర్సులు చదివే వందలాది మందికి ఉపకార వేతనాలు అందిస్తూ విద్యాదాతగా నిలుస్తున్నారు. స్వగ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటు కోసం స్థలం, భవనం అందించడంతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావడానికి కృషి చేశారు.

ఈ సందర్భంగా ఏరువ సాయిరాం మాట్లాడుతూ, తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ఏరువ కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు నిరంతరం అండగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది ఉపకార వేతనాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తయిందని, బుధవారం ఉదయం పెద్ద పలకలూరులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, పత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్, బార్ కౌన్సిల్ సభ్యుడు కొమ్మసాని శ్రీనివాసులురెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

# వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన శ్రీధర్ భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి



## టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి ఘన నివాళి

కడప (జర్నలిస్ట్ ఫైల్ )కడప నగరంలోని ఓం శాంతి నగర్‌కు చెందిన నక్షత్ర మొబైల్స్ యజమాని లావా మొబైల్స్ డిస్ట్రిబ్యూటర్ ముడియం శ్రీధర్ వియత్నాం పర్యటనలో జరిగిన బోటు ప్రమాదంలో దుర్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి వారి నివాసానికి వెళ్లి ముడియం శ్రీధర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముడియం శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఈ తీరని లోటును భరించే శక్తిని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# రైతులకు యూరియా, ఎరువుల కొరత లేదు -అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు

- APAIMS యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు
- జల హారతి-జల ధార కార్యక్రమంతో అదనంగా 0.69 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెంపు
- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు మొత్తం 58,481 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, అందులో యూరియా, డీఏపీ అవసరం 41,028 మెట్రిక్ టన్నులు (యూరియా 26,316 మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,712 మెట్రిక్ టన్నులు) ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 13,509 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించగా, అందులో 5,765 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ (యూరియా 3,720 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,046 మెట్రిక్ టన్నులు) విక్రయించినట్లు తెలిపారు. జూలై నెలాఖరు వరకు 14,034 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, అందులో 8,353 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ అవసరమని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 41,494 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు, అందులో 19,193 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 15,534 మెట్రిక్ టన్నుల యూరియా ఆగస్టు నెల వరకు, 3,659 మెట్రిక్ టన్నుల డీఏపీ ఆగస్టు 15 వరకు సరిపడా నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. జూలై నెలకు జిల్లాకు 19,020 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా, ఇప్పటివరకు 6,505 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయని, మిగిలిన 12,515 మెట్రిక్ టన్నులు త్వరలో జిల్లాకు చేరనున్నాయని తెలిపారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా APAIమీ యాప్ ద్వారానే జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. జూన్ 8 నుంచి ఇప్పటివరకు 6,049 మంది రైతులకు 1,789.9 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ A-PAIMS ద్వారా విక్రయించినట్లు తెలిపారు. ఇందులో 1,218 మెట్రిక్ టన్నుల యూరియా, 571 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతులకు అందించామన్నారు. రైతులు తప్పనిసరిగా APAIMS ద్వారా మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని పాటించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అన్ని మండలాలకు అవసరానికి అనుగుణంగా ఎరువులు నిరంతరం సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, అధిక ధరలకు విక్రయించడం, బలవంతపు ట్యాగింగ్, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, ఎరువుల మళ్లింపు లేదా విక్రయాలను నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనంతరం జల హారతి-జల ధార కార్యక్రమం గురించి కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టి 0.69 టీఎంసీల అదనపు నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించినట్లు తెలిపారు. చెరువులు, కాలువలు, నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, దీంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా వ్యవసాయ అధికారి యం.పద్మావతి పాల్గొన్నారు.

# 201 కుటుంబాల వందేళ్ల సమస్యకు పరిష్కారం

- పుల్లడిగుంట గ్రామ ప్రజలకు తీపి కబురు
- నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కులు
- శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కుంగుంది బాటలో పుల్లడిగుంట
- ముున్ముందు మిగిలిన దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం: మంత్రి అనగాని






**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దీర్ఘకాలికంగా నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని గ్రామాలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. తాజాగా వందేళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని పుల్లడిగుంట గ్రామ ప్రజలందరి సమస్యను తీర్చింది. ఈ గ్రామంలో ఉన్న 201 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లు అన్ని కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. వందేళ్ల క్రితమే ఈ గ్రామంలో ఇళ్లు నిర్మించుకున్నారు. ఎప్పటి నుండో గ్రామ పంచాయితీకి పన్నులు కడుతున్నారు. చాలా ఏళ్ల కాలం నుండి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కార్నెపాడు రెవెన్యూ గ్రామానికి హెమ్లేట్ గా ఉన్న పుల్లడిగుంట ప్రజలు తమ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. తోపు పోరంబోకుగా వర్గీకరించబడ్డ తమ గ్రామం మొత్తం ఉన్న ప్రాంతాన్ని నిషేధిత జాబితా నుండి తొలగించి గ్రామ ప్రాంతంగా వర్గీకరించాలని కోరుతూ ఆ గ్రామ పంచాయితీ తీర్మానం చేసి పంపించింది. ఈ సమస్య తీవ్రతను గమనించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు అధికారులతో గ్రామ రికార్డులను పరిశీలించారు. వందేళ్ల నుండి అక్కడ ప్రజలు ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని, 8.51 ఎకరాల్లో ఇళ్లు, అంతర్గత రోడ్లు నిర్మించి ఉన్నాయని రీ సర్వేలో తేలిందని నిర్ధారించారు. ఈ ఇళ్లకు పక్కనే ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజిద్ కూడా ఉంది. వీటితోపాటు ఎకరం 27 సెంట్లు ఖాళీ భూమి కూడా ఉంది. జిల్లా అధికారుల నుండి వచ్చిన నివేదిక ఆధారంగా తోపు పోరంబోకుగా ఉన్న భూమిని గ్రామ ప్రాంతంగా మార్చాలని, ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొనాలని, ఇళ్ల స్థలాలు ఉన్న 8.51 ఎకరాలను నిషధిత జాబితా నుండి తొలగించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. అదే విధంగా పక్కనే ఉన్న ఎకరం 27 సెంట్లను ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ, ఈ స్థలం తోపాటు ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజీద్ స్థలాలను నిషేధిత జాబితాలో ఉంచాలని కోరుతూ రాష్ట్ర మంత్రి వర్గానికి ప్రతిపాదనలు పంపగా అనుమతి లభించింది. దీంతో పుల్లడిగుంట వందేళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

**ముున్ముందు మరిన్ని దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలకు పరిష్కారం: మంత్రి అనగాని:** దీర్ఘకాలికంగా పెడింగ్ లో ఉండి హక్కులకు నోచుకొని గ్రామలకు విముక్తి కల్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా శెట్టి పల్లి గ్రామంలో దశాబ్దాల కాలం నుండి హక్కుల్లేక ఇబ్బందులు పడుతున్న రెండు వేలమంది సమస్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగు నింపామన్నారు. అదే విధంగా బ్రిటీష్ అధికారుల చేసిన పొరపాటు కారణంగా 120 ఏళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉన్న మండల కేంద్రమైన వట్టి చెరుకూరులోని 5వేల మంది ప్రజలకు వారి ఆస్తులపై హక్కులు కల్పించామన్నారు. ఆ తర్వాత కుప్పం నియోజకవర్గంలోకి కుంగుంది గ్రామంలో 61 ఏళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 322 మంది పేదలకు డికేటీ పట్టాలను అందజేశామన్నారు. వ్యక్తులకు కాకుండా సమూహంగా ఒకే రకమైన సమస్య ఎదుర్కొంటున్న వారికి హక్కులు కల్పించేందుకు రెవెన్యూ శాఖ విశేషంగా కృషి చేస్తోందని, ముున్ముందు ఇలాంటి సమస్యలున్న గ్రామాలకు విముక్తి కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## అబద్ధాల పునాదులపై పుట్టిందే వైసీపీ పార్టీ




- మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు
- మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ సముద్ర ప్రమాదంలో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. ఆ సహాయాన్ని 'ముష్టి'గా వ్యాఖ్యానించడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 10 నాటికల్ మైల్స్ దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లుగా పేర్కొనడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదనే విషయాన్ని వెల్లడిస్తోందన్నారు. వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల 277 మంది మత్స్యకారులు మృతి చెందినా అప్పటి ముఖ్యమంత్రి ఒక్క కుటుంబాన్నీ పరామర్శించలేదని విమర్శించారు.

మత్స్యకారుల భద్రత కోసం ప్రతి పడవకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వానికి సమాచారం చేరే విధంగా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా పథకం కింద రూ. 531 కోట్లు ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 511 కోట్లు అందించిందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీ కార్యక్రమాలను పునఃప్రారంభించామని చెప్పారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగినా సీసీ కెమెరా దృశ్యాలతో నిజాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌తో ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని, అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక ఫలించవని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్ర వైద్య విద్యాభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలి



- ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జి. వీరపాండియన్‌ను డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. సాయి సుధీర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధికి విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాలను వీసీ కార్యదర్శికి వివరించారు. వైద్య, దంత, ఆయుష్, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య శాస్త్రాల విద్యలో నాణ్యత పెంపు, పరిశోధనలకు ప్రోత్సాహం, డిజిటల్ విద్యా వనరుల విస్తరణ, అనుబంధ కళాశాలల్లో విద్యా ప్రమాణాల బలోపేతానికి విశ్వవిద్యాలయం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

వైద్య విద్యను జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, విశ్వవిద్యాలయం పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఇరువురు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వైద్య విద్యాభివృద్ధికి డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను వీరపాండియన్ అభినందించారు.

వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని వీరపాండియన్ హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో సమన్వయం పెంచుకుని రాష్ట్రంలో వైద్య విద్యను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ డా. పి. చంద్రశేఖర్ తెలిపారు.

## సోషల్ మీడియా దూషణలకు చట్టపరంగా బుద్ధి చెప్పాలి: ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఫేక్ అకౌంట్ల ద్వారా మహిళలు, ప్రజా ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మంగళవారం ఐటీడీపీ కమిటీ సభ్యులు ఆమెను కలిసి ఇటీవల సోషల్ మీడియాలో జరుగుతున్న దూషణలు, అనంతర పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉన్నప్పటికీ దానిని దుర్వినియోగం చేస్తూ మహిళలు, ప్రజాప్రతినిధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, దూషణలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం స్వాగతించదగ్గ నిర్ణయమని గళ్లా మాధవి పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, చట్టం తన పని తాను చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి దుర్గేష్

- జనసేనాని పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్..త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష
- శస్త్ర చికిత్స జరిగిన ఈ పరిస్థితుల్లోనూ ప్రజాసేవ, పార్టీ నిర్మాణం, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం జనసేనాని పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

## 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకానికి ఆమోదం



- ఆర్అండ్‌బీ శాఖలో బాధిత కుటుంబానికి ఉద్యోగం అందజేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్లు, భవనాల శాఖలో దాదాపు 17 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకానికి కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సచివాలయంలోని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని లబ్ధిదారుడు కే. లక్ష్మణ్ కుమార్‌కు అందజేశారు.

కాకినాడ ఆర్అండ్‌బీ డివిజన్‌లో గ్యాంగ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న కే.వి. అ-ప్పారావు విధి నిర్వహణలో ఉండగానే అనారోగ్యంతో మరణించారు. అనంతరం ఆయన కుటుంబం కారుణ్య నియామకం కోసం పలుమార్లు ప్రభుత్వాన్ని ఆశ్రయించినప్పటికీ, 2009 నుంచి ఈ అంశం పెండింగ్‌లోనే ఉంది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో అప్పారావు కుమారుడు కే. లక్ష్మణ్ కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల విషయంలో బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మానవతా దృక్పథంతో అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇతర కారుణ్య నియామకాల పరిష్కారానికీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

నియామక పత్రం అందుకున్న కే. లక్ష్మణ్ కుమార్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 17 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ విన్నపాన్ని పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలులో ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలి

- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371-డి ప్రకారం అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులు-2025ను వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగులు, ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా అమలు చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రభుత్వాన్ని కోరింది. జిల్లా, జోన్, మల్టీజోన్, రాష్ట్ర స్థాయి క్యాడర్లను శాస్త్రీయంగా ఏర్పాటు చేసి, క్యాడర్ బలం, ఖాళీలు, వర్కింగ్ స్ట్రెంగ్త్ వివరాలను పారదర్శకంగా ప్రకటించాలని, ఉద్యోగ సంఘాలతో చర్చల్లో గుర్తింపు పొందిన సంఘాలతో పాటు రిజిస్టర్ అయిన ఉద్యోగ సంఘాలను కూడా భాగస్వాములను చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జీఓ ఎంఎస్ నెం. 32ను రద్దు చేసి పాత స్టాఫింగ్ విధానాన్ని కొనసాగించడం, అర్బన్ హెల్త్ సెంటర్లలో సూపర్వైజరీ పోస్టులు మంజూరు చేయడం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో ఖాళీలను భర్తీ చేయడం, జిల్లా క్యాడర్లను జిల్లా పరిధిలోనే కొనసాగించడం, ఎల్ఎస్ఎస్ పోస్టుల్లో ఎంఎ సోషియాలజీ అభ్యర్థులకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని కోరింది.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలులో స్పౌజ్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వడం, 2001 నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, ప్రతి మండల, అర్బన్ ఆరోగ్య కేంద్రంలో అదనపు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్ నర్స్ పోస్టులు మంజూరు చేయడం, హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయడం, ప్రమోషన్లు, నియామకాలపై నిషేధాన్ని ఆగస్టు 31 వరకు సడలించడం, జోనల్, డివిజనల్ కార్యాలయాలను ఉద్యోగులకు అనుకూలంగా ఏర్పాటు చేయడం, జీఓ-67, జీఓఎంఎస్-46లో ఉన్న లోపాలను సరిదిద్దాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గౌరవాధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు, అధ్యక్షుడు కె. జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జి.వి. రమణ, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఈ. విజయ్ కుమార్ రాజు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

## వియత్నాం పడవ ప్రమాద బాధితుల పార్థివ దేహాలు స్వదేశానికి చేరిక

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో వేగవంతమైన చర్యలు..
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు తెలుగు పర్యాటకుల పార్థివ దేహాలు మంగళవారం స్వదేశానికి చేరుకున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రవాణా ప్రక్రియను వేగంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాదం జరిగిన వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విదేశాంగ శాఖ, వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఏపీ భవన్ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పార్థివ దేహాలను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన ఆదేశాలతో వైద్య, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, కార్గో క్లియరెన్స్‌కు సంబంధించిన అన్ని అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేయడంతో జూలై 13 రాత్రి 9.35 గంటలకు పార్థివ దేహాలు ముంబై అంతర్జాతీయ విమాన కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి.

ఈ ప్రక్రియను ఏపీ భవన్ అధికారి చందన నాంచారయ్య క్షేత్రస్థాయిలో సమన్వయం చేశారు. అనంతరం జూలై 14 తెల్లవారుజామున ఇండిగో విమానంలో పార్థివ దేహాలను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పార్థివ దేహాలకు నివాళులర్పించి అధికారికంగా స్వీకరించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ తదుపరి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌ల ద్వారా పార్థివ దేహాలను వారి స్వగ్రామాలైన మచిలీపట్నం, హిందూపురం, కడపలకు గౌరవప్రదంగా తరలించారు. ఆయా జిల్లాల కలెక్టర్ల ప్రతినిధులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడంతో పాటు అంత్యక్రియల ఏర్పాట్లకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని అధికారులు తెలిపారు. ఇదే ప్రమాదంలో చిక్కుకున్న మిగిలిన తెలుగు పర్యాటకులంతా ఇప్పటికే సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని వెల్లడించారు.

## ఉద్యోగుల 27 డిమాండ్లపై రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేసిన ఏపీ జేఏసీ అమరావతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రచైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర నాయకత్వం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన 27 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది.

ఇందులో 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, తక్షణమే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడం, పెండింగ్ డీఏలు విడుదల, రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు పెన్షన్ పునరుద్ధరణ, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ పెంపు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాల అమలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర అంశాలు ఉన్నాయి. ఈ డిమాండ్లకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించిన లేఖల వివరాలను కూడా మంత్రికి అందజేశారు.

ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జూలై 11న మంత్రులతో జరిగిన సమావేశంలో నిర్ణయించిన మేరకు గుర్తింపు పొందిన అన్ని ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఆలస్యం చేయకుండా నిర్వహించి, ఉద్యోగుల పెండింగ్ ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ, అన్ని అంశాలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమావేశాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వం తెలిపింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467